క్లుప్తంగా

పోటాపోటీగా రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ వెల్లటూరు రోడ్డులో గల గుడ్‌షెపర్డ్ పాఠశాల ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఆదివారం నిర్వహించిన పోటీల్లో పురుషుల విభాగం నుంచి ఆరు జట్లు, మహిళా విభాగం నుంచి ఆరు జట్లు పోటీ పడగా, విజయనగరం, గుంటూరు, అనంతపురం, కర్నూలు జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయని ఉమ్మడి గుంటూరు జిల్లా సాఫ్ట్‌బాల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ నరసింహారెడ్డి తెలిపారు. అదేవిధంగా పురుషుల విభాగంలో శ్రీకాకుళం, కృష్ణా, విజయనగరం జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ఇన్నారెడ్డి, పీడీలు చిరంజీవి, రాధాకృష్ణ, సురేష్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఓగేరు వాగులో పడి వ్యక్తి మృతి

చిలకలూరిపేటటౌన్: వాగులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. చిలకలూరిపేట మండలం రాజాపేటకు చెందిన దార్ల వెంకటేశ్వర్లు (36) కుటుంబం ఉపాధి నిమిత్తం గుంటూరు వెళ్లారు. ఇటీవల వెంకటేశ్వర్లు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలో అతని బాబాయికి చెందిన గేదెల్ని మేపేందుకు శనివారం సాయంత్రం పొలానికి తోలుకెళ్లాడు. గ్రామానికి సమీపానే ఉన్న ఓగేరు వాగులో గేదెలు దిగడంతో వాటిని బయటకు తెచ్చేందుకు వెంకటేశ్వర్లు వాగులోకి దిగాడు. లోతు, నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. దూరంగా ఉండి గమనించి ఓ వ్యక్తి గ్రామస్తులకు సమాచారం ఇవ్వడంతో వాగులోకి దిగి కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే వెంకటేశ్వర్లు మృతి చెందాడు. మృతదేహాన్ని రూరల్ పోలీసులు చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రెడ్ల సత్రంలో నూతన భవన సముదాయం

- రూ.80లక్షలతో 16గదుల నిర్మాణం
- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



కోటప్పకొండ రెడ్ల సత్రంలో నూతన భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని శ్రీ యోగి వేమారెడ్డి చారిటబుల్ ట్రస్ట్, రెడ్ల సత్రంలో నూతన భవన సముదాయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. దాతల సహకారంతో దాదాపు రూ.80లక్షలతో నిర్మించిన 16గదులకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ముందుగా రెడ్ల సత్రం ప్రాగణంలోని దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రెడ్ల సత్రం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని తెలిపారు. దాతల అందిస్తున్న విరాళాలను సద్వినియోగం చేస్తూ సత్రం కమిటీ పనిచేస్తుందన్నారు. రెడ్ల సత్రం ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను విస్తృత పరచాలని సూచించారు. నూతనంగా ప్రారంభించిన గదులను కోటప్పకొండ త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకునేందుకు వచ్చే భక్తులు వినియోగించుకోవచ్చని తెలిపారు. సత్రం కమిటీ అధ్యక్షుడు కామిరెడ్డి నర్సిరెడ్డి, కార్యదర్శి చేగిరెడ్డి ఈశ్వరరెడ్డి, కోశాధికారి మేడం రామచౌడారెడ్డి, విప్పల దాణారెడ్డి, వేలూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక..

రెడ్ల సత్రం జనరల్‌బాడీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షుడిగా భవనం రాఘవరెడ్డి, అధ్యక్షుడిగా కంజుల వీరారెడ్డి, కార్యదర్శిగా పాలిమేర వెంకటరెడ్డి, కోశాధికారిగా మాగులూరి సుబ్బారెడ్డి తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆనాటి స్నేహం.. మధురాతి మధురం



హసన్ సాహెబ్‌తో చిన్ననాటి స్నేహితులు

నరసరావుపేట: స్థానిక మున్సిపల్ హైస్కూలులో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 49 ఏళ్ల అనంతరం ఆదివారం మరోసారి కలుసుకున్నారు. మున్సిపల్ అతిథి గృహంలో నిర్వహించిన కార్యక్రమంలో జీఎస్టీ అధికారిగా విజయవాడలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన షేక్ హసన్ సాహెబ్‌ను సన్మానించారు. స్థానిక మున్సిపల్ హైస్కూలులో 1975–76 ఏడాదిలో హసన్ పదో తరగతి చదివారు. ఉద్యోగ విరమణ అనంతరం తనతో పాటు చదివిన అందరిని మరోసారి కలవాలనే సంకల్పంతో అందరితో సమావేశమయ్యారు. కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాల్ని గుర్తు చేసుకున్నారు. తమ కుటుంబాల పరిస్థితుల్ని వివరించారు. రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ తాళ్ల రాజశేఖరరెడ్డి, మాజీ పీపీ కాకుమాను బాలహనుమంతరెడ్డి, స్వస్తిక్ సూరి, బిల్డర్ కాకుమాను మంగపతిరెడ్డి, ఇనగంటి శ్రీనివాసరెడ్డి, మాజీ కౌన్సిలర్ యర్రంశెట్టి రాము, వై.వెంకయ్య, న్యాయవాది శ్రీగిరిరాజు రవిసుధాకర్ శ్యామ్, రిటైర్డు రెవెన్యూ ఉద్యోగి పోలా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు జేఎన్‌వీలో ప్రాంతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

చిలకలూరిపేటటౌన్: మండలంలోని మద్దిరాల పీఎం శ్రీ జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రాంతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహరావు తెలిపారు. జవహర్ నవోదయ విద్యాసమితి ఆధ్వర్యంలో జేఎన్‌వీ విద్యాలయాల విద్యార్థులకు మాత్రమే ఈ పోటీలు ఉంటాయన్నారు. సోమ, మంగళవారాల్లో ఉదయం 10.30 గంటలకు పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. తొలిరోజు పోటీలను పల్నాడుజిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. మరో అతిథిగా ధనలక్ష్మి గ్రూప్ డైరెక్టర్ పి.వీరనారాయణ హాజరవుతారన్నారు. రెండోరోజైన మంగళవారం సాయంత్రం ముగింపు సభా కార్యక్రమంలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరు కానున్నట్లు వెల్లడించారు.

ప్రకాశంపై అనంతపురం ఘనవిజయం

- 5 వికెట్లు సాధించిన హనీఫ్ వీరారెడ్డి
- నరసరావుపేటలో కొనసాగుతున్న అండర్–19 అంతర్ జిల్లాస్థాయి బాలుర క్రికెట్ పోటీలు



నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–19 బాలుర క్రికెట్ పోటీలలో ప్రకాశం జిల్లాపై అనంతపురం 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అనంతపురం తొలి ఇన్నింగ్స్‌లో 324 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ దిగిన ప్రకాశం జట్టు 284 పరుగులకు ఆలౌట్ అయింది. రెండవ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన అనంతపురం శనివారం నాటి 4 వికెట్ల నష్టానికి 65 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో ఆదివారం బ్యాటింగ్ ప్రారంభించి 172 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కె.వెంకట్ లోకేష్ 56 పరుగులు సాధించాడు. ప్రకాశం బౌలర్లు ఆర్.గిరీష్, ఎస్.అఖిల్‌కు చెరో మూడు వికెట్లు లభించాయి. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 171 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని కె.ఆనంద్ 38, కె.అక్షయ్ 38 పరుగులు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో 4వికెట్లతో రాణించిన అనంతపురం బౌలర్ హనీష్ వీరారెడ్డి రెండవ ఇన్నింగ్స్‌లోనూ 5 వికెట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. విజయం సాధించిన అనంతపురం జట్టుకు ఆరు పాయింట్లు లభించాయి. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ముఖ్యం

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ
- స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంటు ప్రారంభం



ఎమ్మెల్యే చదలవాడను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

నరసరావుపేట రూరల్: క్రీడల ద్వారానే విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, శారీరక సామర్థ్యం మెరుగుపడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. కేసానుపల్లి ఎంఏఎం కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఏపీ స్టేట్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌ను ఆదివారం ప్రారంభించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. క్రీడలతో వారిలో మాత్రమే మానసిక ఎదుగుదల చక్కగా ఉంటుందని తెలిపారు. టోర్నమెంట్ల నిర్వహణకు ప్రతి సంస్థ ముందుకు రావాలని పిలుపు ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు డాక్టర్ నెల్లూరి రమేష్, కపిలవాయి విజయ్ కుమార్‌ను కళాశాల ప్రతినిధి ఎం.శేషగిరిరావు సత్కరించారు. టోర్నమెంట్‌కు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 300మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వినుకొండ(నూజెండ్ల): బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపకులు జీ.వి. మాధవరావు ఆధ్వర్యంలో కొత్తపేటలోని వారి కార్యాలయంలో పేద బ్రాహ్మణులకు బియ్యం, నూతన వస్త్రాలు ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుదీర్ఘకాలం సహాయం అందించిన దాతలు చింతలపూడి సుబ్బారావు, అక్కిరాజు శశికళకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థిని తులసి సభ్యులకు బీపీ పరీక్షలు చేసింది.

క్లుప్తంగా

ఎస్‌ఐ బదిలీలో వెల్లివిరిసిన తెలుగు సంప్రదాయ శోభ



నాదెండ్ల: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు సంప్రదాయాల్ని గౌరవించాలని బదిలీ అయిన ఎస్‌ఐ జె. బలరామ్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గతేడాది జులై 19న మండల ఎస్‌ఐగా విధుల్లో చేరిన ఆయన, ఇటీవల పల్నాడు జిల్లా సీసీఎస్‌కే బదిలీ అయ్యారు. రిలీవ్ సందర్భంగా తెలుగు సంప్రదాయం ప్రకారం తెల్లపంచె, షర్టు, కండువా ధరించి స్టేషన్‌కు హాజరయ్యారు. ఏఎస్‌ఐలు రమేష్, కొండలు, మల్లేశ్వరరావు, రోశిబాబు, రవిచంద్ర, గౌస్, కానిస్టేబుళ్లు, సిబ్బంది సైతం సంప్రదాయ దుస్తుల్లో హాజరయ్యారు. దీంతో స్టేషన్‌లో తెలుగు సంప్రదాయ శోభ వెల్లివిరిసింది. బదిలీపై వెళ్తున్న ఆయన్ను శాలువాలతో సత్కరించారు.

శావల్యాపురం ఎస్‌ఐగా లోకేష్‌రావు బాధ్యతల స్వీకరణ



శావల్యాపురం: మండల నూతన ఎస్‌ఐగా లేళ్ల లోకేష్ రావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయం సీసీఎల్‌లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన ఎస్‌ఐ చల్లా సురేష్ నకరికల్లు మండలం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ లోకేష్‌రావు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం సిబ్బందితో పరిచయ కార్యక్రమంతో పాటు దిశా నిర్దేశం చేశారు.

నాదెండ్ల ఎస్‌ఐగా పుల్లారావు



నాదెండ్ల: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కృషి చేస్తానని, ప్రజలు రాజకీయ ఉద్రేకాలకు లోనుకాకుండా ప్రశాంతంగా జీవించాలని నాదెండ్ల ఎస్‌ఐ గాజుల పుల్లారావు చెప్పారు. ఆదివారం ఆయన మండల ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు. చిలకలూరిపేట పట్టణ ఎస్‌ఐగా పనిచేసిన ఆయన సాధారణ బదిలీలో భాగంగా నాదెండ్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు ఏఎస్‌ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

యడ్లపాడు ఎస్‌ఐగా బాలకృష్ణ



యడ్లపాడు: మండల నూతన ఎస్‌ఐగా ఆయన ఆదివారం వంకాయలపాటి బాలకృష్ణ బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న జె. శామ్యూల్‌రాజీవ్‌కుమార్ సత్తెనపల్లి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా, చిలకలూరిపేట రూరల్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ ఆయన స్థానంలో వచ్చారు. బాలకృష్ణ గతంలో గురజాల, అమర్తలూరు, చిలకలూరిపేట రూరల్ మండల పోలీస్‌స్టేషన్లలో పని చేశారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బాలకృష్ణ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రౌడీయిజాన్ని సహించేది లేదు

చిలకలూరిపేట టౌన్: నియోజకవర్గంలో రౌడీయిజానికి పాల్పడితే సహించేది లేదని రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు హెచ్చరించారు. ఆదివారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. అనవసర విషయాల్లో తలదూర్చడం, గొడవలు, ఘర్షణలకు దిగడం చేసి జీవితాల్ని నాశనం చేసుకోవద్దని చెప్పారు. చట్టవ్యతిరేక పరమైన చర్యల్లో పాల్గొంటే రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ జి. అనిల్‌కుమార్ ఉన్నారు.

వి.రెడ్డిపాలెంలో డాక్టర్ గోపిరెడ్డి పర్యటన

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం పర్యటించారు. గ్రామంలోని రైతులు, పెద్దలతో మాట్లాడారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీ అంకమ్మ దేవాలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో దుద్దుకుంట అంకిరెడ్డి, చిన సైదులు రెడ్డి, వెంకట రామిరెడ్డి, కశిరెడ్డి వెంకటకోటిరెడ్డి, పొలిమేర వెంకటరెడ్డి, వీరంరెడ్డి పుల్లారెడ్డి, బోడె సైదులు రెడ్డి, గంగారపు శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, పొలిమేర శేఖర్‌రెడ్డి, నాగిరెడ్డి, వెన్నపూస వెంకట సుబ్బారెడ్డి, గంగారపు పెద్ద వీరారెడ్డి పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాదెండ్ల: సాతులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్. అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సాతులూరు, చందవరం, దొండపాడు, పొనుగుబాడు, డెయిరీ ఇండస్ట్రీస్, సాతులూరు ఇండస్ట్రీస్ పరిసరాల్లో సరఫరా నిలిపి వేయనున్నట్లు పేర్కొన్నారు.



ర్యాగింగ్‌ని నిరోధిద్దాం... విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం

Advt. Special feature



రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శిగా కిరణ్

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శిగా పట్టణానికి చెందిన మండవ వెంకట కిరణ్‌కుమార్ నియమితులైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ఆర్యవైశ్య, వాసవీ సంస్థల్లో చురుకుగా పాల్గొంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్‌కు ఈ పదవి రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. వివిధ సంఘాలకు చెందిన ప్రతినిధులు కిరణ్‌కుమార్‌ను అభినందించారు.



ర్యాగింగ్‌తో భవిష్యత్ బలి

- ఆర్నెల్లు నుంచి జీవిత ఖైదు వరకు శిక్షలు పడే అవకాశం
- ప్రతి విద్యాసంస్థలో యాంటీ ర్యాగింగ్ కమిటీ, స్క్వాడ్లు ఏర్పాటు

నరసరావుపేట: విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. సుప్రీం కోర్టు నుంచి హైకోర్టుల వరకు యాంటీ ర్యాగింగ్‌పై అనేక తీర్పులు వెలువరించాయి. విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వాలకు మార్గదర్శకాలు విడుదల చేశాయి. జూనియర్ విద్యార్థుల్ని సీనియర్లు దూషించడం, హింసించడం, వారితో చేయకూడని పనులు చేయించటం చట్టరీత్యా నేరమని చెబుతున్నాయి. ఈ మేరకు ప్రతి విద్యాసంస్థలో యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ కమిటీ, స్క్వాడ్లు ఏర్పాటు చేశాయి.

ర్యాగింగ్ శిక్షలు

యాంటీ ర్యాగింగ్ చట్టం–1997ను అనుసరించి సెక్షన్ 4(1) నుంచి 4(5)వరకు న్యాయస్థానాలు దోషుల్ని నిర్ధారించి కఠిన శిక్షలు అమలు చేస్తున్నాయి. ఆర్నెల్లు పాటు జైలు, రూ.1000 జరిమానా లేదా రెండూ విధించవచ్చు. దాడి , నేరపూరిత బలాన్ని ఉపయోగించి బెదిరింపులకు పాల్పడితే ఏడాది జైలు లేదా రూ.2వేలు జరిమానా, రెండూ విధించవచ్చు. విద్యార్థిని నిరోధించడం, నిర్బంధించడం, గాయపర్చడం చేస్తే రెండేళ్ల జైలు లేదా రూ.5వేలు జరిమానా లేదా రెండూ విధించవచ్చు. విద్యార్థిని అపహరించడం, అత్యాచారం చేయడం, అసహజ నేరానికి పాల్పడటం, తీవ్రంగా గాయపర్చడం వంటి చర్యలకు పాల్పడితే ఐదేళ్ల జైలు లేదా రూ.10వేలు జరిమానా లేదా రెండూ విధించే అధికారం న్యాయస్థానానికి ఉంది. విద్యార్థి మరణానికి, ఆత్మహత్యకు ప్రేరేపించిన వ్యక్తికి జీవితఖైదు లేదా పదేళ్ల వరకు శిక్ష లేదా రూ.50వేలు జరిమానా విధించవచ్చు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థల్లో సీనియర్ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.















